

# గందరగోళంగా హద్దుల నిర్ధారణ

- ఇప్పటికీ 50 శాతం కూడా పూర్తిచేయని వైనం..
- నవంబర్‌లో మొదటి వారంలో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశం
- ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను సమన్వయం చేయలేకపోతున్న అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల నిర్ధారణ గందరగోళంగా సాగుతున్నది. నవంబర్ మొదటి వారంలోనే చెరువులన్నింటికీ బఫర్, ఎఫ్‌టీఎల్ హద్దుల నిర్ధారణ పూర్తిచేయాల్సి ఉంది. కానీ, ఇప్పటికీ 50 కూడా పూర్తిచేయలేకపోయారు. హైకోర్టు ఇచ్చిన గడువు ముంచుకొస్తున్న తరుణంలో అధికారుల్లో ఒత్తిడి పెరుగుతున్నది. అధికారులు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలను సమన్వయం చేయలేకపోతున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువుల హద్దులపై హైకోర్టు ఆదేశించేంత వరకు చోద్యం చూసిన యంత్రాంగం.. ఇప్పుడు ఒత్తిడికి గురవుతున్నది. ఏడు జిల్లాల పరిధిలో ఉన్న చెరువుల హద్దులపై ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కానీ, ఇప్పటి వరకు బఫర్, ఎఫ్‌టీఎల్ జోన్ ప్రాంతాన్ని నిర్ధారణ చేయలేదు. అధికారుల నిర్లక్ష్యంతో చెరువు భూములన్నీ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల అన్యాక్రాంతంపై ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణ చేయమంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను నవంబర్‌లోగా ఖరారు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికీ ఈ అంశాన్ని హెచ్‌ఎండీఏ కమిషనర్ సీరియస్ తీసుకోకపోవడంతో గడువు దగ్గర పడుతున్నా ప్రక్రియలో ఎలాంటి పురోగతి లేకుండాపోయింది. ఇప్పటివరకు 2,525 చెరువులకు మాత్రమే ప్రాథమికంగా హద్దులు ఖరారు చేశారు. ఇందులో 230 చెరువులకు మాత్రమే పూర్తిస్థాయి బఫర్ జోన్, ఎఫ్టీఎల్ నిర్ధారించారు. మిగిలిన 1,000 చెరువులకు కనీసం బఫర్‌జోన్లను కూడా నిర్ధారించలేదు.

### లోపించిన సమన్వయం..

చెరువు హద్దుల నిర్ధారణలో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఇచ్చే మ్యాపులను మాత్రమే హెచ్‌ఎండీఏ ప్రామాణికంగా తీసుకోవాలి. కానీ, హెచ్‌ఎండీఏ చేసిన సర్వే ఫలితాలు వాటికి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే హద్దుల వివాదానికి కారణమైందనే విమర్శలు ఉన్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల రికార్డులు, హెచ్‌ఎండీఏ సేకరించిన వివరాల మధ్య భారీ వ్యత్యాసంతోనే ఏ ఒక్క చెరువు విషయంలోనూ వాస్తవ హద్దులను పూర్తిస్థాయిలో నిర్ధారించలేదు.

# మూసీ నిర్వాసితులకు టవర్స్ నిర్మిస్తాం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : మూసీ నిర్వాసితులకు అక్కడే టవర్స్ నిర్మిస్తామని, వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుచేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం నిర్డ్‌కో ఏర్పాటుచేసిన ప్రాపర్టీ షోలో ఆయన మాట్లాడారు. మూసీ నిర్వాసితులైన డ్వాక్రా మహిళలకు రూ.1,000 కోట్ల వడ్డీలేని రుణాలు ఇస్తామని, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధిని కల్పిస్తామని తెలిపారు. కాలుష్య డ్రైనేజీల ట్రీట్‌మెంట్‌కు 39 ఎస్టీపీలు మంజూరుచేసినట్టు చెప్పారు. భవిష్యత్తుతరాల కోసం మూసీ పునరుజ్జీవం, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల మూలంగా రిజిస్ట్రేషన్లలో కొంత స్తబ్ధత ఏర్పడిందని, ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నట్టు పేర్కొన్నారు.

hmda Growing Global

# రెవెన్యూ క్లియరెన్స్ ఉంటేనే బిల్డింగ్ పర్మిషన్లు

## కూల్చివేతలతో పర్మిషన్లపై హెచ్‌ఎండీఏ ఆచితూచి నిర్ణయం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : బిల్డింగ్ అనుమతుల విషయంలో హెచ్‌ఎండీఏ రూట్ మార్చింది. ఇటీవల హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో అనుమతుల విధానంలో మార్పులు చేపట్టింది. గతంలో భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగానే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ప్రమేయం లేకుండా అనుమతుల ప్రాసెస్ మొదలుపెట్టేది. కానీ, ఇటీవల హెచ్‌ఎండీఏ అనుమతులు ఉన్న భవనాలను కూడా హైడ్రా కూల్చివేయడంతో అనుమతుల ప్రక్రియలో మార్పులు చేపట్టింది. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏలోని రెవెన్యూ విభాగం ఇచ్చే క్లియరెన్స్ ఆధారంగానే అనుమతులు జారీ చేయాలని, అప్పుడే ప్లానింగ్ విభాగం సంబంధిత ఫైల్ ప్రాసెస్‌ను మొదలుపెట్టే విధానాన్ని తెరపైకి తీసుకొచ్చింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల ధ్రువీకరణ కూడా ప్రామాణికంగా తీసుకోనున్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే ముందుగా హెచ్‌ఎండీఏలోని రెవెన్యూ అధికారులు టైటిల్ క్లియరెన్స్ ఇస్తే గానీ అనుమతుల ప్రక్రియను మొదలుపెట్టకూడదనే నిబంధనలు అమలుచేస్తున్నారు. దీంతో అనుమతుల జారీ మరింత జాప్యం కానున్నది.

### కీలకం కానున్న క్షేత్రస్థాయి నివేదిక..

ఆయా సర్వే నంబర్లతో అనుమతుల కోసం ఒకసారి దరఖాస్తు చేసుకోగానే ఫీల్డ్ లెవల్ రిపోర్టు ఇప్పుడు కీలకం కానున్నది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈ స్థాయి అధికారి నిర్ధారించాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయి అధికారుల పనితీరుపై అనుమతులు ఆధారపడి ఉండటమే కాకుండా, వారిచ్చే సూచనలను ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో కొన్నిసార్లు రెవెన్యూపరమైన అక్రమాలకు ఆస్కారం ఉంటుందని, గతంలో మాదిరి ఇరిగేషన్ అధికారులు అక్రమాలకు పాల్పడి ఎన్ఓసీలు జారీ చేస్తే వాటిని మాత్రమే ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

# రంగారెడ్డిలో నెలాఖరులో కూల్చివేతలు!

## ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించిన హైడ్రా

## భయాందోళనకు గురవుతున్న ప్రజలు



ఇబ్రహీంపట్నం పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన నిర్మాణాలు

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26: రంగారెడ్డి జిల్లా పరిధిలోని చెరువులపై హైడ్రా ప్రత్యేక ఫోకస్ పెట్టింది. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల్లో ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం, బఫర్‌జోన్‌ల విస్తీర్ణంను గుర్తించి ప్రత్యేకంగా మ్యాప్‌లను తయారుచేస్తున్నారు. ఇప్పటికే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఈ ప్రక్రియలో మునిగిపోయారు. రంగారెడ్డి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువులు, కుంటలున్నాయి. దాదాపు 600 నుంచి 650 వరకు చెరువులు, కుంటలున్నాయి. ఇందులో మొదటి దశలో మేజర్ చెరువు, కుంటలను ఎంపికచేసి ఆ చెరువు సర్వేనెంబర్ల ఆధారంగా ఎఫ్‌టీఎల్‌లో ఎంతభూమి ఉంటుంది. ఆపైన బఫర్‌జోన్‌లో ఎంత భూమి ఉంటుందనే విషయాన్ని మ్యాప్‌ల రూపంలో గుర్తిస్తున్నారు. 2014 సంవత్సరంలో హెచ్‌ఎండీఏ 'ఆర్వీ' అనే ప్రైవేటు ఏజెన్సీ ద్వారా చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను సాటిలైట్ ఆధారంగా గుర్తించింది. అప్పుడు నిర్దేశించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధినే మరోసారి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి మ్యాప్‌లను తయారుచేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని అర్బన్ మండలాల్లో ఉన్న చెరువు, కుంటల్లో సుమారు 250 నుంచి 350 చెరువుల వరకు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమణకు గురైన చెరవుల సర్వేనెంబర్ల ఆధారంగా ఎఫ్‌టీఎల్‌లో ఎంత భూమి వస్తుంది. బఫర్‌లో ఎంత భూమి ఉంటుందని మరోసారి గుర్తించి హైడ్రా అధికారులకు అప్పగించనున్నారు.

### ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన మండలాలు

రంగారెడ్డిజిల్లా పరిధిలో అర్బన్ ఏరియాలోగల అబ్దుల్లాపూర్‌మెట్‌తో పాటు హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, బాలాపూర్, కందుకూరు, కొత్తూరు, ఫారుక్‌నగర్, షాబాద్, మొయినాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట్ వంటి మండలాల్లో చెరువులు, కుంటలు ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. మొదటి దశలో ఈ మండలాల్లో హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే చెరువులను ప్రత్యేకించి పరిశీలిస్తున్నారు. ఈ చెరువుల వద్ద బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను గుర్తిస్తున్నారు. మరో పదిహేను రోజుల్లో వీటిని గుర్తించి ఫైనల్‌లిస్ట్ తయారుచేసి అధికారులకు అందజేయనున్నట్టు తెలిసింది. ఇప్పటికై హైడ్రా అధికారులు ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని ఇబ్రహీంపట్నం పెద్దచెరువును, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తుర్కయంజాల్ మాసబ్‌చెరువును పరిశీలించారు. ఔటర్‌లోపలి గ్రామాల్లోనే హైడ్రా కూల్చివేతలుంటాయని అధికారులు చెబుతున్నప్పటికీ.. ఔటర్ వెలుపలి ప్రాంతాల్లో కూడా హెచ్‌ఎండీఏ అధికారులు పర్యటిస్తూ చెరువులను పరిశీలిస్తున్నారు. మరోవైపు హైడ్రా అధికారుల తీరుతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.

### హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే మండలాలు

రంగారెడ్డి జిల్లాలో హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే మండలాలు శేరిలింగంపల్లి, మొయినాబాద్, కందుకూరు, షాబాద్, నందిగామ, ఫారుఖ్‌నగర్, ఇబ్రహీంపట్నం, శంకర్‌పల్లి, శంషాబాద్, మహేశ్వరం, రాజేంద్రనగర్, గండిపేట్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, యాచారంలో కొంతభాగముంది. ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున జరిగిన విషయం తెలిసిందే.

# హైడ్రా పేదల ఇండ్లు కూల్చలేదు

- అది కూల్చినవన్నీ పెద్దల ఇండ్లే
- కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేల చేరికలు ఆగలేదు
- కొండా సురేఖ వ్యాఖ్యలు తప్పే
- ఢిల్లీలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్



హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): హైడ్రాతో హైదరాబాద్‌కు ఇబ్బందేమీ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. హైడ్రా పేదల ఇండ్లు కూల్చలేదని, అది కూల్చినవన్నీ సంపన్నులవేనని తెలిపారు. ఢిల్లీలో శనివారం కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైడ్రా కూల్చిన ఇండ్లలో ఒక్కటే పేదల ఇల్లు ఉన్నదని, మిగిలినవన్నీ పెద్దలవేనని చెప్పారు. కొందరు హైడ్రా, మూసీపై లేనిపోని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు కూల్చివేతకు అధికారులు నోటీసులు ఇచ్చారని, కానీ కోర్టు ఆదేశాలతో ఆగిపోయారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికలు నిలిచిపోలేదని, త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉండేవాళ్లు కూడా నిత్యం తమను సంప్రదిస్తూనే ఉన్నారని చెప్పారు. ఇప్పటికే చేరినోళ్లకు కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయని, అందుకే వారు చేరినట్టు ప్రకటించడం లేదని అన్నారు. ప్రభుత్వానికి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చని, అదానీ కూడా అదేవిధంగా ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ, నాగార్జున కుటుంబం వివాదంపై స్పందించిన మహేశ్‌కుమార్.. సురేఖ వ్యాఖ్యల్ని తప్పుపట్టారు. మంత్రి సురేఖ వ్యక్తుల పేర్లు తీసుకొని మాట్లాడి ఉండకూడదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతామని, పథకాలను ఎగ్గొట్టే ఆలోచనల ప్రభుత్వానికి లేదని చెప్పారు. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ అనేది అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల్లోనే ఉన్నదని తెలిపారు. జీవన్‌రెడ్డి అనుచరుడి హత్యపై విచారణ చేయాలని సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాగారంలోని కుమ్మరి కుంట చెరువు

# ఎఫ్‌టీఎల్ నిర్మాణాల గుర్తింపు

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 97 చెరువుల్లో హద్దుల గుర్తింపు

మేడ్చల్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాల గుర్తింపులో అధికారులు నిమగ్నమయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లో 620 చెరువులు ఉండగా, ఇప్పటికే 97 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల హద్దులను గుర్తించారు. మరో 110 చెరువుల హద్దుల గుర్తింపు కొనసాగుతున్నది. రెవె న్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు సం యుక్తంగా గుర్తిస్తున్నారు. హద్దులు గుర్తించిన చెరువుల సమీపంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని నిర్మాణాల వివరాలను నమో దు చేసుకుంటున్నారు. 97 చెరువులకు గానూ ఇప్పటికే 21 చెరువుల్లో నిర్మాణాల వివరాల సేకరణ పూర్తయినట్టు అధికారుల ద్వారా తెలిసింది. మరో నెల రోజుల్లో మొత్తం నిర్మాణాల నమోదును పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టారు. త్వరలోనే లేఅవుట్లకు సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించేందుకు అధికారులు నోటీసులు జారీచేయనున్నట్టు సమాచారం. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దుల గుర్తింపుతోపాటు నిర్మాణాలను గుర్తిస్తున్న క్రమంలో నిర్మాణాల యజమానుల్లో ఆందోళన నెలకొన్నది. ఇప్పటికే హైడ్రాతో ప్రజలు బెంబేలెత్తుతున్న విషయం తెలిసిందే.

# ఆగని కూల్చివేతలు

## మూసీ నిర్వాసితులను వెంటాడుతున్న సర్కార్ • తాజాగా మూసారంబాగ్‌లో 25 ఇండ్లు నేలమట్టం

### నిర్వాసితులే తమ ఇండ్లు కూల్చుకుంటున్నారని గతంలో సీఎం ప్రగల్భాలు • నాటి, నేటి కూల్చివేతలన్నీ ప్రభుత్వం చేసినవే..



మూసారంబాగ్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

హైదరాబాద్ సిటీబ్యూరో/మలక్‌పేట, అక్టోబర్ 26 ( నమస్తే తెలంగాణ ) : మూసీ నిర్వాసితులు ఓ వైపు తమ ఇండ్లను కూల్చొద్దంటూ వేడుకుంటున్నా.. రేవంత్ సర్కారు మాత్రం ఏమాత్రం కనికరం చూపడం లేదు. చడీచప్పుడు లేకుండా కూల్చివేతల ప్రక్రియను కొనసాగిస్తున్నది. ఓవైపు సీఎం రేవంత్ రెడ్డి.. మూసీ నిర్వాసితులు తమ ఇండ్లను వాళ్లే కూల్చుకుంటున్నారని ప్రగల్భాలు పలికారు. కానీ, నాడు, నేడు ఆ కూల్చివేతలన్నీ సర్కారే చేసిందనడానికి అధికారులు అక్కడ ఉండి కూల్చివేతల ప్రక్రియను చేపట్టడమే నిదర్శనం. నాడు మూసానగర్, శంకర్‌నగర్‌లో 150 ఇండ్లను కూల్చిన ప్రభుత్వం.. తాజాగా మూసారంబాగ్‌లో శనివారం మూసీ రివర్‌బెడ్‌లోని 25 ఇండ్లను నేలమట్టం చేసింది. ఇండ్ల పైకప్పులు తొలిగించి గోడలను బద్ధలు కొట్టించారు. ఎన్ని కూలగొడుతున్నాం? ఏ మేర కూలగొట్టాం? ఇంకా ఎన్ని కూల్చాల్సినవి ఉన్నాయనే లెక్కలు అధికారులు అక్కడే ఉండి రాసుకోవడం విశేషం. కండ్లముందే ఇండ్లు భూస్థాపితమవుతుంటే దిక్కుతోచక స్థితిలో బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.

### చెదిరిన పేదోడి గూడు..

మూసారంబాగ్ సాయిలు హట్స్‌లోని వారివి రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు. ఏండ్ల తరబడి అక్కడే నివాసముంటున్నారు. ఈ ఇండ్లపై అధికారులు గతంలోనే రెడ్‌మార్క్ వేశారు. అప్పటి నుంచి ఇండ్లు కూలగొడితే తమ బతుకులు ఏమవుతాయోనని నిద్రలేని రాత్రులు గడిపారు. చివరకు శనివారం ఇండ్లను కూల్చివేశారు. డివిజన్ పరిధిలో మొత్తం 109 నిర్మాణాలు రివర్ బెడ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సాయిలు హట్స్‌లో 25 నిర్మాణాలు, అంబేద్కర్ హట్స్‌లో 17 నిర్మాణాలు, ఆదిజాంబవంతుని హట్స్, అజయ్ హట్స్‌లో 26 నిర్మాణాలు ఉండగా, సాయిలు హట్స్‌లో 5, అజయ్ హట్స్‌లోని 20 ఇండ్లను కూల్చివేయించి బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ ఇండ్లతో వారికి ఏండ్లుగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ బాధాతప్త హృదయాలతో సామగ్రి తీసుకెళ్లారు. వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు.

### నిర్వాసితుల్లో భయాందోళన..

మూసీ రివర్‌బెడ్‌లోని నిర్మాణాల కూల్చివేతలు త్వరగా పూర్తిచేయాలని సర్కారు నుంచి అధికారులకు ఆదేశాలు రావడంతో ఆ మేరకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మొదటి దఫా మూసానగర్, శంకర్‌నగర్‌లో 150 ఇండ్లను కూల్చివేసిన సంఘటనపై సర్వత్రా పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. ప్రజలు తీవ్రంగా విమర్శించారు. బాధితులతో చర్చించకుండా ఇండ్లను కూల్చడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కూల్చివేతలపై సర్కారు కొంత వెనకడుగు వేసినట్టు నటించింది. కానీ, తాజాగా కూల్చివేతల ఘటనతో మళ్లీ మూసీ నిర్వాసితుల్లో భయాందోళన నెలకొన్నది. రివర్‌బెడ్‌లో అధికారుల లెక్కల ప్రకారం 2,166 నిర్మాణాలు, బఫర్‌జోన్‌లో 7,851 నిర్మాణాలు, 200 ఓపెన్ ల్యాండ్స్ ఉన్నాయి. మూసీ బాధితులంతా బస్తీల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి కూల్చివేతలకు వ్యతిరేకంగా నినదిస్తున్నారు. కలెక్టర్లకు, మంత్రులకు తమ ఇండ్లు కూల్చొద్దని వినతిపత్రాలు ఇస్తున్నారు. అయినా పేదోడి బాధను పట్టించుకోని రేవంత్ సర్కార్ మొండిగా వ్యవహరిస్తున్నది.

### సీఎంగారూ.. ఇప్పుడేమంటారు?

**మూసీ** నిర్వాసితులే తమ ఇండ్లను కూల్చుకున్నారంటూ గతంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన అంతా అబద్ధమని తేలిపోయిందని బస్తీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గతంలో మూసానగర్, శంకర్‌నగర్ ఇండ్లను కూల్చివేయడానికి నియమించిన లేబర్‌కు సర్కారు నుంచే డబ్బులు అందాయని, ఇప్పుడు అధికారులు దగ్గరుండి మూసారంబాగ్ కూల్చివేతలను చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం పేదోళ్ల జోలికి రావొద్దని సూచించారు. మూసీ అభివృద్ధి పేరుతో నిరుపేదల ఇండ్లు కూల్చితే.. సహించేది లేదంటూ హెచ్చరించారు. మార్కెట్ వ్యాల్యూ ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, నగరంలో తమ ఇంటికి సమానమైన స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

# మేం కూల్చాం... మీరు ఎత్తండి..!

- శిథిలాల తరలింపు బాధ్యత యజమానులదే..: హైడ్రా
- లేదంటే తుక్కు అమ్మగా మిగిలిన వ్యయం వసూలుకు నోటీసులు
- ఎర్రకుంట పరిధిలో తాజా విధానం అమలు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): హైడ్రా బాధితులపై మరో పిడుగు పడింది. బుల్డోజర్లతో కూల్చివేసిన ఇండ్ల తాలూకు శిథిలాలను వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ భవన యజమానులకు ఆదేశాలు జారీచేశారు. ఒకవేళ తరలించకుంటే సంస్థ తరఫున ఆ ప్రక్రియ చేపట్టి, అందుకు అయ్యే వ్యయాన్ని యజమానుల నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం హైడ్రా తరఫున ఒక ప్రకటన విడుదల చేశారు. నిజాంపేట పరిధిలోని ఎర్రకుంట కూల్చివేతల వద్ద తాజా విధానాన్ని అమలు చేశారు. అందులో భాగంగా బాధితులకు నోటీసులు కూడా జారీ చేశారు. ఇప్పటికే కూల్చివేతలతో కుమిలిపోతున్న బాధితులు హైడ్రా నోటీసులతో లబోదిబోమంటున్నారు.

### ఎర్రకుంటలో మొదలైంది..

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు చేపట్టారని అనేక ప్రాంతాల్లో హైడ్రా కూల్చివేతలు చేపట్టిన విషయం తెలిసిందే. భవనాలను కూల్చివేసిన తర్వాత శిథిలాలు అక్కడే ఉన్నాయి. కాగా, చెరువుల సుందరీకరణ పనులు మొదలుపెట్టేందుకు హైడ్రా ప్రణాళిక రూపొందించగా.. ఆ మేరకు శిథిలాలను తరలించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా తొలుత నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంట శిథిలాల తరలింపు ప్రక్రియ మొదలుపెట్టారు. అయితే, శిథిలాల తరలింపునకు అయ్యే ఖర్చును భవనాల యజమానులే చెల్లించాలని హైడ్రా స్పష్టం చేస్తున్నది. శిథిలాల తరలింపు పనులను టెండర్ ద్వారా ఓ సంస్థకు అప్పగించింది. శిథిలాల్లో టన్నుల కొద్దీ తుక్కు ఉన్న దరిమిలా దానిని వేలం వేసి వచ్చే మొత్తాన్ని శిథిలాల తరలింపునకు వినియోగిస్తుంది. కాగా, తరలింపునకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుండటంతో వేలంలో వచ్చిన మొత్తం మినహాయించి మిగిలిన డబ్బులను చెల్లించాలని హైడ్రా నోటీసులు జారీ చేసింది. కూల్చివేతలు చేపట్టిన ప్రాంతాలను ఒక్కొక్కటిగా ఎంచుకొని ఈ ప్రక్రియను అమలు చేసేందుకు హైడ్రా అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

### తరలించకుంటే చర్యలే..:

#### రంగనాథ్, హైడ్రా కమిషనర్

హైడ్రా కూల్చివేతల అనంతరం నిర్మాణ వ్యర్థాలను సదరు యజమానులే తొలగించాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వ్యర్థాలను తొలగించేందుకు ఖర్చులు చెల్లించకపోతే తుక్కు, ఇనుప చువ్వలను విక్రయించగా వచ్చిన డబ్బులు పోను మిగతా డబ్బులు కచ్చితంగా యజమానులే చెల్లించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చామని, కొందరు తొలగిస్తుంటే మరికొందరు అలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కూల్చివేతల ప్రాంతాన్ని పూర్వస్థితికి తీసుకురావాల్సిన బాధ్యత యజమానిపైనే ఉంటుందని రంగనాథ్ స్పష్టంచేశారు.

### ఐరన్ తరలింపు, అమ్మకం వాస్తవమే..!

**ఎర్రకుంట** చెరువులో హైడ్రా కూల్చేసిన భవనాల్లోని ఇనుమును తరలిస్తున్నారంటూ బిల్డర్ సోషల్ మీడియాలో వీడియోలు పెట్టిన నేపథ్యంలో రంగనాథ్ వివరణ ఇచ్చారు. సుధాకర్‌రెడ్డి అనే బిల్డర్ ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఐదంతస్థులవి మూడు భవనాలను నిర్మించారని, అతనిపై ఇరిగేషన్ అధికారులు బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారని తెలిపారు. భవనాల వ్యర్థాలను తొలగించాలని హైడ్రా నోటీసులు ఇచ్చిన తర్వాత విలువైన వస్తువులను తీసుకెళ్లి భవన వ్యర్థాలను అక్కడే వదిలేశారని వివరించారు.



### తాత్కాలిక నిర్మాణాలకైనా

# అనుమతి పొందాల్సిందే

#### తేల్చిచెప్పిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): ఏపీలోని కర్నూలు జిల్లా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భార్య ఉమామహేశ్వరమ్మకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. హైదరాబాద్ అమీన్‌పూర్‌లోని తన ఫాంహౌస్ చుట్టూ తాత్కాలికంగా ప్రహరీ గోడను నిర్మించుకునేందుకు అనుమతి ఇచ్చేలా మున్సిపాలిటీకి ఉత్తర్వులు జారీ చేయాలన్న ఆమె విన్నపాన్ని జస్టిస్ కే లక్ష్మణ్ తోసిపుచ్చారు. శాశ్వత నిర్మాణాలతోపాటు ప్రహరీ గోడలాంటి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టేందుకైనా మున్సిపాలిటీ నుంచి విధిగా అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చేశారంటూ కోర్టుకు వస్తే జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పారు. ముందుగా మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకోవాలని, అనుమతి లభిస్తేనే ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపట్టాలని పిటిషనర్‌కు సూచించారు. అమీన్‌పూర్ సరస్సు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు చెప్తున్న వ్యవసాయ భూమిలో ఉమామహేశ్వరమ్మ నిర్మించిన షెడ్లను ఇటీవల హైడ్రా కూల్చివేయడంతో ఆమె ఈ పిటిషన్ దాఖలు చేశారు.



ములుగు మండలంలోని ఇంచర్ల శివారులో ఉన్న హార్టికల్చర్ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

# పేదల గుడిసెల తొలగింపు

## పోలీస్, రెవెన్యూ శాఖ దాడులు • ఆ స్థలం స్పోర్ట్స్ స్కూల్‌కు కేటాయింపు

ములుగురూరల్, అక్టోబర్ 26: ములుగు జిల్లా ములుగు మండలం ఇంచర్ల శివారులో హార్టికల్చర్ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలను శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 11 గంటల మధ్య పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు తొలగించారు. సర్వే నంబర్ 17లో మొత్తం 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. మూడు ఎకరాల స్థలంలో కొన్ని పార్టీల ఆధ్వర్యంలో పేదలు 37 గుడిసెలను వేసుకున్నారు. ఈ గుడిసెల్లో సెంటు భూమి లేని వారు కొందరు నివాసముంటుండగా, మరికొందరు ఇండ్లు ఉన్న వారు ఉన్నారు. గతంలో ప్రభుత్వ అవసరాల నిమిత్తం స్థలాన్ని ఖాళీ చేయాలని అధికారులు తెలియజేసినప్పటికీ గుడిసెవాసులు ఖాళీ చేయలేదు. తాజాగా ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, డీఎస్పీ రవీందర్, ములుగు, వెంకటాపురం (నూగూరు) సీఐలుశంకర్, బండారి కుమార్, ములుగు, వెంకటాపూర్, తాడ్వాయి, ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, రామకృష్ణ, సతీశ్, శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో గుడిసెల వద్దకు చేరుకున్నారు. గుడిసెల్లోని సామగ్రిని ఒక్కొక్కటిగా బయట వేసి, మూడు జేసీబీలు, నాలుగు ట్రాక్టర్ల సహాయంతో గుడిసెలను తొలగించారు. మంగపేట మండలంలోని తిమ్మంపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వెంకటాపూర్ మండలంలోని పెద్దాపూర్, పాలంపేట, నారాయణపూర్, తాడ్వాయి మండలంలోని కామారం గ్రామాలకు చెందిన ప్రజల సామగ్రిని పోలీసులు ప్రత్యేక వాహనాల్లో ఎక్కించి వారి వారి మండలాలకు తరలించారు. కాగా.. హార్టికల్చర్ భూముల పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించేందుకు ఇటీవల మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ పాఠశాలకు అనుసంధానంగా స్పోర్ట్స్ స్కూల్ ను నిర్మించేందుకు హారికల్చర్ భూమిని కొన్ని రోజుల క్రితం అధికారులు పరిశీలించారు. ఇందులో భాగంగా అక్రమంగా వేసిన గుడిసెలను తొలగించి జేసీబీల సాయంతో కందకాలు తీశారు. సెప్టెంబర్ 24న గుడిసె వాసులందరికీ షోకాజ్ నోటీసులు అందించారు. గడువు లోగా వారు గుడిసెలను తొలగించనందున శనివారం గుడిసెలను తొలగించినట్టు ములుగు తహసీల్దార్ తెలిపారు.

# కుమ్మరివాడిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి

## జీహెచ్‌ఎంసీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌లోని కుమ్మరివాడిలో అక్రమ నిర్మాణాలను పరిశీలించాలని హైకోర్టు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది. ఆ ప్రాంతంలోని అక్రమ నిర్మాణాలపై 4 వారాల్లోగా చర్యలు చేపట్టడంతోపాటు సంబంధిత నివేదికను హైకోర్టు జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌కు అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. పూర్వీకుల నుంచి వచ్చిన 426 చదరపు గజాల స్థలంలో నిర్మాణాలు చేపట్టడంపై జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మహ్మద్ అబ్దుల్ ముబీన్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ.. కుమ్మరివాడిలో 350కిపైగా అనధికార నిర్మాణాలు ఉన్నాయని, వాటిపై ఫిర్యాదు చేసినా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ సైతం ఎలాంటి అనుమతుల్లేకుండా భవనాలను నిర్మించుకున్నారని, వాటిపై అధికారులు స్పందించకుండా పిటిషనర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. దీంతో కుమ్మరివాడిలో అక్రమ నిర్మాణాలు పరిశీలించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేశారు.